నమస్తే తెలంగాణ
Telangana Today
నిపుణ
నమస్తే తెలంగాణ
హైదరాబాద్, గురువారం 12 సెప్టెంబర్ 2024
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna


# వ్యవసాయ వ్యర్థాలు.. మారిస్తే ప్రయోజనాలు



గ్రూప్స్-1 ప్రత్యేకం
జనరల్ ఎస్సే

6. ప్రశ్న: జీవ ఇంధనాల రకాలను లేదా వర్గాలు వివరిస్తూ భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ జీవ ఇంధన విభాగం-2018 ద్వారా చేకూరే ప్రయోజనాలను వివరించండి.

**జవాబు:** ఏవైనా ఒక కర్బన పదార్థం నుంచి తక్కువ వ్యవధిలో ఉత్పత్తి అయ్యే హైడ్రో కార్బన్ ఇంధనాన్నే జీవ ఇంధనంగా పరిగణిస్తారు. జీవ ఇంధనాలు ఘన, ద్రవ లేదా వాయు పదార్థాలుగా ఉండవచ్చు.

**ఉదా:** ఘన:- చెక్క, ఎండిన మొక్కల పదార్థాలు
ద్రవ:- బయో ఇథనాల్, బయో డీజిల్
వాయు:- బయో గ్యాస్

**జీవ ఇంధనాలను వివిధ వర్ణాలుగా విభజించారు.**

ఎ. **మొదటి తరం జీవ ఇంధనాలు:-** సంప్రదాయక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని చక్కెర, పిండి పదార్థం, కూరగాయలు, నూనెలు లేదా జంతువుల కొవ్వు వంటి ఆహార వనరుల నుంచి వీటిని తయారు చేస్తారు.

బి. **రెండోతరం జీవ ఇంధనాలు:-** ఇవి ఆహారేతర పంటలు లేదా తినేందుకు ఉపయోగపడని వ్యర్థాలుగా పరిగణింపజేసే ఆహార పంటల భాగాల నుంచి ఉత్పత్తి చేస్తారు. ఉదా: కాండం, పొట్టు, పండ్ల తొక్కల వంటి పదార్థాలు

సి. **మూడోతరం జీవ ఇంధనాలు:-** వీటిని శైవలాల వంటి సూక్ష్మ జీవుల ద్వారా ఉత్పత్తి చేస్తారు.

డి. **నాలుగోతరం జీవ ఇంధనాలు:** వీటిని ఉత్పత్తి చేయడంలో అధిక మొత్తంలో కర్బన పదార్థం సమకూరేందుకు జెనెటిక్ ఇంజినీరింగ్ చేసిన పంటలను పండించి తద్వారా వచ్చిన బయోమాస్‌ను ఉపయోగిస్తారు.

- జీవ ఇంధనాలు ప్రధాన రకాలుగా బయో ఇథనాల్, బయో డీజిల్, బయో గ్యాస్, బయో బ్యూటనాల్, బయో హైడ్రోజన్‌ను పరిగణిస్తారు.
- జీవ ఇంధనాల వినియోగానికి ప్రధాన కారణం చమురు ధరలు పెరగడం, శిలాజ ఇంధనాల నుంచి గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారం, రైతుల ప్రయోజనాల కోసం మారుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం జీవ ఇంధనాలపై 2018లో జాతీయ విధానాన్ని ప్రకటించింది.
- ఈ విధానం జీవ ఇంధనాలను 'ప్రాథమిక జీవ ఇంధనాలుగా' వర్గీకరిస్తుంది. ఇందులో భాగంగా జీవ ఇంధనాలను మూడు తరాలుగా వర్గీకరించారు. ప్రతి వర్గం కింద ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తుంది. జీవ ఇంధనాలకు సంబంధించి అన్ని సంబంధిత మంత్రిత్వ శాఖలు/విభాగాల పాత్రలు, బాధ్యతలు ఇందులో పొందుపరచబడ్డాయి.

**ఆశించిన ప్రయోజనాలు**

1. **దిగుమతిపై ఆధారపడటం తగ్గుముఖం పడుతుంది:-** E10 ద్వారా రూ.28 కోట్ల ఫారెక్స్ ఆదా అవుతుంది. అంతేకాకుండా 2017-18 సంవత్సరానికి రూ.150 కోట్ల Lt ఇథనాల్ ఉత్పత్తి ద్వారా రూ.4,000 కోట్ల విలువ చేసే విదేశీ కరెన్సీ ఆదా అయింది.
2. **పరిశుభ్రమైన వాతావరణం:-** పంట దహనాలను తగ్గించడం, వ్యవసాయ అవశేషాలు/వ్యర్థాలను జీవ ఇంధనంగా మార్చడం ఫలితంగా గ్రీన్ హౌస్ ఉద్గారాలను మరింత తగ్గించవచ్చు.
3. **ఆరోగ్య ప్రయోజనాలు:-** వినియోగించిన వంట నూనెలను జీవ ఇంధనాల ఉత్పత్తికి మళ్లించడం మూలంగా ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి.
4. **గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పెట్టుబడి:-** దేశ వ్యాప్తంగా రెండో తరం రిఫైనరీలను అదనంగా చేర్చడం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది.
5. **ఉపాధి కల్పన**

**రైతులకు అదనపు ఆదాయం:** రెండోతరం సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం ద్వారా రైతులు కాల్చివేసే వ్యవసాయ వ్యర్థాలను ఇథనాల్‌గా మార్చవచ్చు. ఈ వ్యర్థాల కోసం మార్కెట్‌ను అభివృద్ధి చేస్తే రైతులకు ఆదాయం చేకూరుతుంది.

7. **ప్రశ్న: సామాజిక అటవీకరణం అంటే ఏమిటో తెలిపి సుస్థిర గ్రామీణాభివృద్ధికి ఏ విధంగా దోహదపడుతుందో పరిశీలించండి.**

**జవాబు:** సామాజిక అటవీ ప్రాంతం అనేది గాంధేయ తత్వశాస్త్రంలోని 'ఆర్థిక వృద్ధి, సమాజ అభివృద్ధి' భావనలో అంతర్భాగంగా చెప్పవచ్చు. పెరుగుతున్న జనాభా కారణంగా అడవులు తీవ్ర ఒత్తిడికి లోనుకావడం, మానవ ప్రేరిత చర్యల కారణాల వల్ల భూమి క్షీణిస్తుందని గ్రహించి భారత ప్రభుత్వ వ్యవసాయ జాతీయ కమిషన్ 1973లో మొదటిసారి 'సామాజిక అటవీ' అనే పదాన్ని ఉపయోగించింది.

- సామాజిక అటవీకరణ అంటే సమాజానికి, గ్రామీణాభివృద్ధికి సహాయపడాలి. అడవుల నిర్వహణ, రక్షణతో కూడుకునేదిగా ఉంటూ బంజరు భూముల్లో అడవుల పెంపకాన్ని ప్రోత్సహించడం. ఇది ప్రజల ఆధారితమైనది. అంతేకాకుండా ప్రజలు, ప్రభుత్వ అవసరాలు, కోరికలు, ఆకాంక్షలను సంతృప్తిపరిచేలా ప్రధాన లక్ష్యంతో నిర్వహించే అడవుల ఆధారిత కార్యక్రమం.
- సామాజిక అటవీకరణం పర్యావరణ పరంగా, ఆర్థిక పరంగా, సమాజ వికాస పరంగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇందులో భాగంగా స్థిరమైన సుస్థిరతతో కూడిన గ్రామీణాభివృద్ధిని సాధించేందుకు సమర్థవంతమైన సాంకేతిక పరిజ్ఞానంతో సామాజిక అటవీకరణం ఉపయోగపడుతుంది.

1. **పర్యావరణ అభివృద్ధి:-** వ్యర్థ భూమిని, క్షీణించిన నిరుపయోగ భూములను ఉపయోగించడం ద్వారా సహజ అడవులపై ఒత్తిడి తగ్గుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వినోద సౌందర్యాన్ని పెంపొందిస్తుంది. వ్యవసాయ భూమిని వాతావరణ మార్పులకు మరింత స్థితి స్థాపకంగా మార్చడం మూలంగా అవి 'Carbon sink' (కార్బన్ డై ఆక్సైడ్ పరిమాణాన్ని తగ్గించే సాధకాలు)గా పని చేస్తాయి.
2. **ఆర్థికాభివృద్ధి:-** కలప, కట్టెలు, వంట చెరకు, పశుగ్రాసాల స్థానిక అవసరాలు తీర్చబడతాయి. ఇటువంటి అడవులు ఉపాధి అవకాశాలు, వ్యవసాయ ఉత్పాదకతకు కూడా దోహదపడతాయి. దీని ద్వారా హార్టికల్చర్, సేంద్రీయ వ్యవసాయం వంటి పద్ధతులు కూడా అభివృద్ధి చెందుతాయి.
3. **సామాజిక అభివృద్ధి, వికాసం:** సామాజిక అటవీకరణం అనేది గ్రామీణ భూములపై జరగడం మూలంగా గ్రామం మొత్తం పాల్గొంటుంది. పిల్లలు, మహిళలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొనడం మూలంగా 'సామాజిక సమైక్యత'కు పూనుకుంటుంది.
4. **ప్రజల ప్రవర్తన శైలిలో మార్పు తెస్తుంది:-** వివిధ రకాల కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు చెట్ల ప్రాముఖ్యంపై అవగాహన పెరిగి అడవులను ఎలా వినియోగించుకోవాలో తెలపడం మూలంగా వారి జీవన ప్రమాణాల్లో మార్పు వస్తుంది.
5. **శక్తి భద్రతకు దోహదపడటం:-** జీవ ఇంధనాలు, బయోగ్యాస్ ఇతర రకాల పునర్వినియోగ శక్తి వనరుల లభ్యతగా సామాజిక అటవీ ప్రాంతం ఉపయోగపడుతుంది.

- సామాజిక అటవీకరణం గ్రామాలను సుసంపన్నం చేయడమే కాకుండా భవిష్యత్ తరానికి స్థిరమైన అభివృద్ధిని సాధించడంలో ఎంతో సాయపడుతుంది. అంతేకాకుండా దీని కోసం ప్రభుత్వం, పౌర సమాజం తనవంతు కార్యక్రమాలు అమలు చేస్తూ గాంధీజీ కలలుకన్న స్వప్నాలను నిజం చేసేందుకు తగిన కృషి చేయాలి.

ప్రశ్న 8. **నీటి కాలుష్యానికి గల కారణాలు, దాని ప్రభావాలు వివరించండి. 'నమామిగంగే' కార్యక్రమాన్ని వివరిస్తూ అందులో భాగంగా ఉన్న మూల స్తంభాలను తెలపండి.**

**జవాబు:**

- నీటి రసాయనిక, భౌతిక లేదా జీవ సంబంధమైన స్వభావాల్లో మార్పులు చెంది తద్వారా దాని నాణ్యత లోపించడంతో పాటు తాగడానికి లేదా ఉపయోగానికి లేదా జీవించడానికి నిరుపయోగంగా ఉన్న మరో ప్రక్రియనే నీటి కాలుష్యంగా చెప్పవచ్చు.
- నీటి కాలుష్యానికి మానవ ప్రేరేపిత కారణాలు ప్రధానంగా ఉన్నాయని చెప్పొచ్చు. అందులో ముఖ్యంగా రెండు రకాలు. అవి...

1. **ప్రత్యక్ష కారణాలు:** మూలాలు- పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా నీటిలోకి విడుదలవడం
2. **పరోక్ష కారణాలు:** ఇవి నేరుగా కాకుండా కాలుష్య కారకాలు విస్తరించిన ప్రాంతాలు లేదా వ్యవసాయ క్షేత్రాల నుంచి ప్రవహించే ప్రవేశాల ద్వారా, నిర్మాణ స్థలాలు, నిరుపయోగంలో ఉన్న గనులు, గుంటలు మొదలైన ప్రాంతాల నుంచి కాలుష్య కారకాలు నీటిలో చేరుతాయి.

**కారణాలు**

- **మురుగు నీరు:** గృహాలు ఇతర ప్రమేయాల నుంచి విడుదలయ్యే మురుగు నీటిలో అనేక హానికర పదార్థాలైన మానవ, జంతువుల మలమూత్రాలు, శుభ్రపరిచే ఏజెంట్లు, డిటర్జెంట్ల వంటివి, ఆస్పత్రుల నుంచి వచ్చే పనికిరాని చెత్త చెదారం మూలంగా అనేక హానికర సూక్ష్మ జీవులు నీటిలో చేరి కలుషితం చేస్తాయి.
- ఇటువంటి పదార్థాలన్నీ నీటిలో చేరి అందులో కలిగి ఉన్న ఆక్సిజన్‌ను తగ్గిస్తాయి. తద్వారా నీటిలో పెరిగే జంతువుల, మొక్కల మనుగడకు ముప్పు సంభవిస్తుంది. ఒకవేళ ఆక్సిజన్ విలువ 4.0mg/L కంటే తక్కువగా ఉంటే అది అత్యంత కలుషితమైన నీరుగా చెప్పవచ్చు.
- **పారిశ్రామిక వ్యర్థాలు:** పెట్రోలియం, కాగితం, రసాయనాల తయారీ తదితర పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు భార లోహాలు (పాదరసం, కాడ్మియం, రాగి, సీసం) వంటి పదార్థాలు నీటిలోకి విడుదలయ్యి హానికరంగా మారుతుంది.
- **వ్యవసాయ వనరులు:** వ్యవసాయ పొలం నుంచి వచ్చే ప్రవాహంలో నైట్రేట్లు, ఫాస్ఫేట్లు, అమ్మోనియం, పురుగుల మందుల తయారీలో ఉపయోగించే క్లోరినేటెడ్ హైడ్రో కార్బన్లు, ఆర్గానోఫాస్ఫేట్లు, కార్బోనేట్లు మొదలైనవి రసాయనిక పదార్థాలు చెరువులు, కుంటల్లో చేరి నీటి కాలుష్యానికి దారి తీస్తాయి. తద్వారా 'యుట్రోఫికేషన్'కి దారి తీసి ఆవరణ వ్యవస్థకు ప్రమాదం ఏర్పడుతుంది.

**నీటి కాలుష్య ప్రభావాలు**

- నీటి కాలుష్యం వల్ల మానవుని ఆరోగ్యంపై, పర్యావరణంపై ఎంతో ప్రభావం చూపుతుంది.

i) **ఆరోగ్యంపై ప్రభావం:** పారిశ్రామిక మురుగు నీటి నుంచి వచ్చే సీసం, ఆర్సెనిక్, పాదరసం, కాడ్మియం వంటి భార లోహాల మూలంగా కలుషితమైన నీటిని తాగడం వల్ల అనేక రోగాలకు దారి తీస్తాయి.

| | |
|---|---|
| పాదరసం | కాడ్మియం |
| సీసం | ఆర్సెనిక్ |

- ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీటి ద్వారా దంతాలు, ఎముకల సమస్యలు వస్తాయి.

**పర్యావరణం:** నీటి కాలుష్యం వల్ల ఆహార గొలుసులు, నీటి ఆవరణ వ్యవస్థకు ముప్పు వాటిల్లుతుంది. DDT, పాదరసం వంటి విష పదార్థాలు 'Biomagnification' చెంది అనేక జీవ రాశులపై ప్రభావం చూపుతుంది. అంతిమంగా ఆహార వలయాలకు ముప్పు వాటిల్లి ఆవరణ వ్యవస్థ మనుగడ దెబ్బతింటుంది.

- గంగా నది కాలుష్యాన్ని ప్రక్షాళనలో భాగంగా రూ.23,000 వేల కోట్ల పెట్టుబడితో చేపట్టిన కార్యక్రమమే 'నమామి గంగే'. ఇందులో భాగంగా మురుగునీటి కర్మాగారాలను ప్రారంభించడం, నీటిని శుభ్రపరిచేందుకు ఒక నిర్దిష్ట మార్గాన్ని చూపడం దీని ప్రధాన ఉద్దేశం.

**ఇందులో ప్రధాన స్తంభాలు:**

1. మురుగు నీటిని శుభ్రపరచడానికి అవస్థాపన
2. అటవీకరణం
3. రివర్-ఫ్రంట్ అభివృద్ధి
4. సామాజిక అవగాహన
5. పారిశ్రామిక ప్రవాహాల పర్యవేక్షణ
6. నది ఉపరితలాలను శుభ్రపరచడం మొదలైనవి.

- నీరు జీవావరణానికి ప్రధాన ఇంధనం. కాబట్టి దాన్ని కాలుష్య కోరల నుంచి పరిరక్షించడం దేశ ప్రభుత్వాలతో పాటు పౌరుల బాధ్యత అనే అంశం కూడా దృష్టిలో ఉంచుకొని నీరు దుర్వినియోగం చెందకుండా పౌర సమాజం, వ్యక్తిగత మార్గ చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.



ప్రకాశ్,
ఏమర్స్ విల్
హైదరాబాద్

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఇంజినీర్స్ ఇండియాలో...

**ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 17
- **పోస్టులు:** గ్రేడ్-1,2,3 జూనియర్ డ్రాఫ్ట్స్‌మ్యాన్
- **అర్హతలు,** ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 25
- **వెబ్‌సైట్:** https://recruitment.eil.co.in

### బామర్ లారీలో...

**బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్‌లో రెగ్యులర్/ఫిక్స్‌డ్ టర్మ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 24
- **పోస్టులు:** సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్, డిప్యూటీ మేనేజర్, ఆఫీసర్/జూనియర్ ఆఫీసర్ తదితరాలు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 4
- **వెబ్‌సైట్:**https://www.balmerlawrie.com

### ఈసీజీసీ లిమిటెడ్‌లో...

**ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీజీసీ) లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 40
- **పోస్టులు:** ప్రొబేషనరీ ఆఫీసర్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 13
- **వెబ్‌సైట్:** https://main.ecgc.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్: కరెంట్ అఫైర్స్ , తెలంగాణ చరిత్ర బిట్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

## భారత క్షిపణి వ్యవస్థ



- 1958 దేశ రక్షణ రంగంలో ఆధునిక టెక్నాలజీ ఉపయోగించడానికి క్షిపణి వ్యవస్థను రూపొందించడానికి డీఆర్‌డీవోను స్థాపించారు.
- డీఆర్‌డీవో అంటే డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్. దీని ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది. ఇది రక్షణ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది.
- 1979 క్షిపణుల రూపకల్పనలో భాగంగా తొలిసారి డెవిల్, వలియెంట్ క్షిపణులు ప్రయోగించారు. కానీ విఫలమయ్యాయి.




- 1983 భారత రక్షణ వ్యవస్థకు వ్యూహాత్మక, కీలక క్షిపణులను రూపొందించడానికి డా. ఏపీజే అబ్దుల్‌కలాం నేతృత్వంలో ఇంటిగ్రేటెడ్ గైడెడ్ అడ్వాన్స్‌డ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభించారు.
- ఒకేసారి 5 క్షిపణులు ప్రారంభించారు. 1-అగ్ని, 2-పృథ్వీ, 3-నాగ్, 4-ఆకాశ్, 5-త్రిశూల్
- భారత క్షిపణుల రూపకల్పనలో డీఆర్‌డీవో నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది
- క్షిపణి అంటే ఇంధనాన్ని ఉపయోగించుకుని నిర్దేశిత లక్ష్యం మీద దాడి చేసే వాహకం
- ఏరో డైనమిక్ క్షిపణులు వెడల్పయిన రెక్కలతో గాలిలో ఎగిరే క్షిపణులు
- బాలిస్టిక్ క్షిపణులు రెక్కలు లేకుండా దూరంగా ప్రయాణించి నిర్దేశిత లక్ష్యాలను ఛేదించేవి
- క్రూయిజ్ క్షిపణులు సముద్ర గర్భం నుంచి పయనించేవి.

# రాజ్యం నిర్వచనం గురించి ఏ ఆర్టికల్‌లో పేర్కొన్నారు?

గ్రూప్స్ ప్రత్యేకం
పాలిటీ

**సెప్టెంబర్ 9 తరువాయి**




33. **ఆదేశిక సూత్రాల అమలు కోసం పార్లమెంట్ ప్రాథమిక హక్కులను తగ్గించడం, సవరించడం చేయరాదని సుప్రీంకోర్టు ఏ కేసులో స్పష్టం చేసింది?**
ఎ) గోలక్‌నాథ్ కేసు
బి) ఉన్నికృష్ణన్ కేసు
సి) చంపకం దొరై కేసు
డి) కేశవానంద భారతి కేసు

34. **పార్లమెంట్ 24వ రాజ్యాంగ సవరణ చట్టం (1971)ను 25వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని (1971) సుప్రీంకోర్టు ఇచ్చిన ఏ కేసునకు స్పందించి చేశారు?**
ఎ) కేశవానందభారతి కేసు
బి) గోలక్‌నాథ్ కేసు
సి) చంపకం దొరై కేసు
డి) మినర్వా మిల్స్ కేసు

35. **25వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఏర్పడిన నూతన ప్రకరణ ఏది?**
ఎ) ఆర్టికల్ 30(ఎ)
బి) ఆర్టికల్ 31 (డి)
సి) ఆర్టికల్ 31 (సి)
డి) ఆర్టికల్ 31

36. **25వ రాజ్యాంగ సవరణ చట్టం ఏ ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా ఉంది?**
ఎ) ఆర్టికల్ 14 బి) ఆర్టికల్ 19
సి) ఆర్టికల్ 31 డి) పైవన్నీ

37. **కింది వాటిలో సరైనది గుర్తించండి.**
1. 42వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రాథమిక హక్కుల పరిధిని తగ్గించి ఆదేశిక సూత్రాల పరిధిని విస్తృతం చేసింది
2. మినర్వా మిల్స్ కేసులో సుప్రీం కోర్టు ఆదేశిక సూత్రాల కంటే ప్రాథమిక హక్కులు ఉన్నతమైనవిగా పేర్కొంది
ఎ) 1 బి) 2
సి) 1, 2 డి) 1, 2 సరికావు

38. **కింది వాటిలో సరైనవి గుర్తించండి.**
1. రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భంగం కలగకుండా పార్లమెంట్ ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులను సవరించవచ్చు
2. ఆర్టికల్ 39(బి), 39 (సి)కి లోబడి ఆర్టికల్ 14, 19 ఉండటాన్ని సుప్రీం కోర్టు సమర్థించింది
ఎ) 1 బి) 2
సి) 1, 2 డి) 1, 2 సరికావు

39. **కేసులను వాటి సంవత్సరాలతో జతపరచండి.**

| | |
|---|---|
| 1. గోలక్‌నాథ్ కేసు | ఎ. 1967 |
| 2. కేశవానందభారతి కేసు | బి. 1976 |
| 3. మినర్వా మిల్స్ కేసు | సి. 1980 |
| 4. 42వ రాజ్యాంగ సవరణ | డి. 1973 |

ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
బి) 1-ఎ, 2-డి, 3-సి, 4-బి
సి) 1-ఎ, 2-సి, 3-డి, 4-బి
డి) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి

40. **కింది ప్రకరణల్లో గాంధేయ సూత్రాలకు సంబంధించినవి ఏవి?**
ఎ) ఆర్టికల్స్ 40, 43, 43(బి), 46, 47, 48
బి) ఆర్టికల్స్ 40, 43, 46, 47, 49
సి) ఆర్టికల్స్ 40, 43, 43(ఎ), 45, 47, 48 (ఎ)
డి) ఆర్టికల్స్ 40, 43, 48, 49

41. **కార్యనిర్వహణ శాఖ నుంచి న్యాయశాఖను వేరు చేయడానికి రాజ్యం కృషి చేయాలని చెప్పే ప్రకరణ ఏది?**
ఎ) ఆర్టికల్ 49 బి) ఆర్టికల్ 50
సి) ఆర్టికల్ 51 డి) ఆర్టికల్ 52

42. **కింది వాటిలో సరైనదాన్ని గుర్తించండి.**
1. న్యాయవ్యవస్థను కార్యనిర్వాహణ శాఖ నుంచి ద క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 వేరు చేసింది
2. ప్రస్తుతం కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎంఆర్‌వోలు, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ విధులు మాత్రమే నిర్వహిస్తారు. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ విధులు నిర్వహించే హక్కు లేదు
ఎ) 1 సరైనది బి) 2 సరైనది
సి) 1, 2 సరైనవి డి) 1, 2 సరికావు

43. **రాజ్యాంగంలో అంతర్జాతీయ శాంతి భద్రతలను పెంపొందించడం అనే భావన ఏ ఆర్టికల్‌లో పేర్కొన్నారు?**
ఎ) ఆర్టికల్ 50 బి) ఆర్టికల్ 44
సి) ఆర్టికల్ 49 డి) ఆర్టికల్ 51

44. **రాజ్యాంగంలో రాజ్యం నిర్వచనం గురించి ఏ ఆర్టికల్‌లో పేర్కొన్నారు?**
ఎ) ఆర్టికల్ 12 బి) ఆర్టికల్ 13
సి) ఆర్టికల్ 36 డి) ఎ, సి

45. **భారత ప్రజలకు ఒకే రకమైన సివిల్ కోడ్‌ను అమలు చేయాలని ఏ కేసులో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది?**
ఎ) షాబానో కేసు
బి) సరళాముద్గల్ కేసు
సి) గోపాలన్ కేసు
డి) ఉన్నీకృష్ణన్ కేసు

46. **దేశంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం?**
ఎ) జమ్ముకశ్మీర్
బి) కేరళ
సి) గోవా డి) నాగాలాండ్

47. **ఆదేశిక సూత్రాలు ప్రభుత్వాన్ని ఉద్దేశించగా, ప్రాథమిక విధులు వ్యక్తిని ఉద్దేశించినవి అని పేర్కొన్నది?**
ఎ) బీఆర్ అంబేద్కర్
బి) ఇందిరా గాంధీ
సి) చాగ్లా
డి) ఫైలి

48. **ఆర్టికల్ 48 అనుసరించి గోవధ నిషేదాన్ని అమలుచేస్తున్న రాష్ట్రం?**
ఎ) మధ్యప్రదేశ్
బి) ఉత్తరప్రదేశ్
సి) గుజరాత్
డి) పైవన్నీ

49. **ఆదేశిక సూత్రాలకు సంబంధించి రాజ్యాంగంలో ఎన్ని ఆర్టికల్స్ ఉన్నాయి?**
ఎ) 15 బి) 14
సి) 16 డి) 17

50. **సమానమైన పనికి సమాన వేతనం అనేది దేనికి సంబంధించింది?**
ఎ) ప్రాథమిక హక్కులు
బి) ప్రాథమిక విధులు
సి) ఆదేశిక సూత్రాలు
డి) చట్టబద్ధమైన హక్కు

51. **కింది వాటిలో ఆదేశిక సూత్రాల్లో పేర్కొనబడని అంశాన్ని గుర్తించండి.**
1. బలవంతపు చాకిరిని నిషేధిస్తుంది
2. మద్యపాన నిషేధం
3. వ్యక్తి గౌరవం కాపాడటం
4. సమన్యాయం అందించడం
ఎ) 1, 2, 3 బి) 2, 3, 4
సి) 2, 4 డి) 2

52. **కింది వాటిలో సరైనదాన్ని గుర్తించండి.**
1. 6 నుంచి 14 సంవత్సరాల బాలబాలికలకు నిర్బంధ ఉచిత విద్యను అందించాలని డీపీఎస్‌పీలో పేర్కొనబడింది
2. ఆదేశిక సూత్రాల అమలు విషయంలో సుప్రీంకోర్ట్ జోక్యం చేసుకోరాదు
ఎ) 1 బి) 2
సి) 1, 2 డి) 1, 2 సరికావు

53. **కింది వాటిలో సరైనదాన్ని గుర్తించండి.**
1. రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్న స్వేచ్ఛ సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం భావనలు ఆదేశిక సూత్రాల అమలు ద్వారా సాధించవచ్చు
2. ఆదేశిక సూత్రాలను దృష్టిలో పెట్టుకొనే ఆయా ప్రభుత్వాలు చట్టాలు చేస్తాయి
ఎ) 1 బి) 2
సి) 1, 2 డి) 1, 2 సరికావు

54. **భారత రాజ్యాంగంలో సంక్షేమ భావన ఎక్కడ ఎక్కువ కనిపిస్తుంది?**
ఎ) పీఠిక
బి) ప్రాథమిక హక్కులు
సి) ఆదేశిక సూత్రాలు
డి) పైవన్నీ

55. **సమన్యాయం భావన రాజ్యాంగంలో ఎక్కడ కనిపిస్తుంది?**
ఎ) ప్రాథమిక హక్కులు
బి) పీఠిక
సి) ఆదేశిక సూత్రాలు
డి) పైవన్నీ

56. **ఆదేశిక సూత్రాలు అనేవి?**
ఎ) ప్రభుత్వాలకు సకారాత్మక లక్ష్యాలు నిర్దేశించడానికి ఉపయోగపడతాయి
బి) దేశ గుణాత్మక అభివృద్ధిని కాంక్షించేవి
సి) ప్రజాస్వామిక ఫలాన్ని అందరికి అందించే వాస్తవ అంశాలు
డి) సామ్యవాద లక్ష్యాన్ని సాధించే అంశాలున్నాయి
ఎ) 1, 2, 3 బి) 1, 2, 3, 4
సి) 2, 3, 4 డి) 1, 2, 4

57. **ఆదేశిక సూత్రాల అమలును కింది వాటిలో ఏ అంశం నిర్దేశిస్తుంది?**
ఎ) వనరుల లభ్యత
బి) న్యాయస్థానాలు
సి) ప్రభుత్వాల సంకల్పం
డి) పైవన్నీ

58. **ఆదేశిక సూత్రాలు భవిష్యత్‌లో పార్లమెంట్ చేసే చట్టాలకు ఆధారంగా పనికి వస్తాయని పేర్కొంది ఎవరు?**
ఎ) అంబేద్కర్ బి) నెహ్రూ
సి) మున్షి డి) బీఎన్ రావ్

59. **ఆదేశిక సూత్రాల్లో పేర్కొనని అంశాన్ని గుర్తించండి?**
1. విద్య 2. అస్పృశ్యత
3. ఫారెస్ట్ 4. సమన్యాయం
ఎ) 2, 4 బి) 1, 2, 3, 4
సి) 2, 3, 4 డి) 1, 2

**జవాబులు**

| | | | |
|---|---|---|---|
| 33.ఎ | 34.బి | 35.సి | 36.డి |
| 37.సి | 38.ఎ | 39.బి | 40.ఎ |
| 41.సి | 42.డి | 43.ఎ | 44.ఎ |
| 45.ఎ | 46.సి | 47.డి | 48.డి |
| 49.సి | 50.సి | 51.బి | 52.ఎ |
| 53.సి | 54.సి | 55.సి | 56.డి |
| 57.డి | 58.ఎ | 59.ఎ | |



ఎం.ప్రవీణ్ కుమార్
విషయనిపుణులు
హైదరాబాద్